సాక్షి
నల్లగొండ

శుక్రవారం । 21 । జూలై । 2023



హైవేపై ట్రాఫిక్ జామ్

గుండ్రాంపల్లి శివారులో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. - 8లో



దేశ భవిష్యత్‌ను ...

బీజేపీ దేశ భవిష్యత్‌ను దిగజారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబ శివరావు ఆరోపించారు. - 10లో

గరిష్టం/కనిష్టం
30° / 24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సూర్యాపేటలో సీఎం పర్యటన వాయిదా

సూర్యాపేట: ఈనెల 24న సూర్యాపేట జిల్లాలో జరగాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పర్యటన వాయిదా పడినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన సందర్భంగా సూర్యాపేట జిల్లా నూతన కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం, సమీకృత మార్కెట్ ప్రారంభోత్సవం చేసేందుకు కార్యక్రమాన్ని రూపొందించి తగిన ఏర్పాట్లు కూడా చేశామని గుర్తు చేశారు. అయితే రెండు మూడు రోజులుగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండడంతో వాయిదా అని వార్యమైనట్లు ఆయన పేర్కొన్నారు.

ఈవీఎం ప్రదర్శన కేంద్రం ప్రారంభం



డెమో ఈవీఎంలో ఓటు వేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డెమో ఈవీఎంలో ఆయన ఓటు వేసి చూపించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎన్నికల డీటీ విజయ్ పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించాలి

నల్లగొండ: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి బూత్‌కు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, వివిధ పార్టీల ప్రతినిధులు బక్క పిచ్చయ్య, పోతెపాక లింగస్వామి, నర్సిరెడ్డి, వంటెపాక యాదగిరి, మల్లికార్జున్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎన్నికల డీటీ విజయ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

నల్లగొండ: త్రిపురారం, పెద్దవూర, చందంపేటలో గల మినీ గురుకుల బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట గురుకుల కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహిస్తున్న ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్‌తోపాటు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగులకు సంక్షేమ నిధి, మినిమమ్ బేసిక్ వేతనం అమలు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మోతీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మినీ గురుకుల ఉపాధ్యాయులు జ్యోతి, విమల, స్వర్ణలత, రూస్సీ, సరోజ, శ్వేత, శైలజ, రోజా కుమారి, లక్ష్మి, అనూష, కవిత ఉమాదేవి, నీలా పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలకు ఆటంకం

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామం నుంచి ఏపూరు గ్రామానికి వెళ్లే దారిలోని మూలమలుపు వద్ద మసీదు ఎదురుగా బుధవారం సాయంత్రం ఓ భారీ వాహనం వెళుతూ ఇరుక్కుపోయింది. దీంతో అర్ధరాత్రి వరకు ఆ దారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారుగా 190 టైర్లతో ఉన్న ఈ భారీ వాహనం ఓ విద్యుత్ ప్లవర్‌ప్లాంట్‌కు చెందిన 500 టన్నుల బరువు గల మిషనరీని తీసుకువెళుతూ ఈ దారిలో ఇరుక్కుపోయింది. దీంతో మరో వాహనం సహాయంతో ఇరుక్కుపోయిన భారీ వాహనాన్ని ముందుకు తీసుకెళ్లారు.

4.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

నల్లగొండ అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ముసురు వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 4.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. చిట్యాల మండలంలో 17.8 మిల్లీమీటర్లు, శాలిగౌరారంలో 13.0, నార్కట్‌పల్లిలో 10.2, మునుగోడు 7.7, దామెరచర్ల 7.1, కట్టంగూరు 7.0, నకిరేకల్ 6.7, కేతెపల్లి 6.6, వేములపల్లి 6.3, నల్లగొండ 5.7, మర్రిగూడ 5.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిప్పర్తి 5.5, అడవిదేవులపల్లి 5.1, చండూరు 4.5, మాడుగులపల్లి 4.8, నిడమనూరు 4.2, మిర్యాలగూడ 3.9, త్రిపురారం 3.5, నాంపల్లి 3.2, చింతపల్లి 2.3, అనుముల హాలియా 2.1, కనగల్ 1.6, పీఏపల్లి 1.5, గుండ్లపల్లి 1.5, పెద్దవూర 1.3, గుర్రంపోడు 1.3, తిరుమలగిరిసాగర్ 0.7, దేవరకొండ 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వ్యాధుల ముప్పు



నల్లగొండ పట్టణంలోని ఓ వార్డులో నిలిచిన మురుగు నీరు

- కురుస్తున్న వర్షాలతో పెరగనున్న దోమలు, ఈగలు
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం
- ఇప్పటివరకు జిల్లాలో 12 డెంగీ పాజిటివ్ కేసులు నమోదు
- అప్రమత్తమైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ

నల్లగొండ టౌన్: కురుస్తున్న వర్షాలతో అనేక చోట్ల మురుగునీటి గుంతలు, మురుగు కాలువల్లో నీరు చేరుతోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 12 డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నల్లగొండ మండలం రాములబండ పీహెచ్‌సీలో 2, నల్లగొండ అర్బన్ పీహెచ్‌సీలో 2, తిప్పర్తిలో 1, పెద్దవూర 1, కనగల్‌లో 2, వేములపల్లిలో1, నార్కట్‌పల్లిలో 2, చిట్యాలలో 1 డెంగీ కేసు నమోదైంది. అదేవిధంగా చికున్ గున్యా కేసులు 2, మలేరియా కేసులు 5 నమోదయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. సంబంధిత అధికారులు సమన్వయంతో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు.

దోమల నివారణకు ఫాగింగ్

మున్సిపల్, పట్టణ అర్బన్ ఏరియాల్లో అధికారులు, సిబ్బందిని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ విష జ్వరాల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. దోమల లార్వా ఉన్న మురుగునీటి కాలువలు, నీటి గుంటలు, కుంటలైన 8,110 ప్రాంతాలను గుర్తించి వాటిని నిర్మూలించడానికి అవసరమైన మందును పిచికారీ చేయిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ట్యాంకులు, నీటి గుంటలు, కాలువలు, డ్రమ్ములు, పూలతొట్లు, పాత టైర్లలో నిలిచిన నీటిని పారపోయించే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 6వేలకు పైగా ఇళ్లల్లో డ్రైడేగా పాటించి నిల్వ ఉన్న మురుగు నీటిని పారబోయించారు. తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బందితో కలిసి ఏఎన్‌ఎంలు, ఆశాలు పైప్‌లైన్ లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు సిద్ధం చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



వర్షాకాలంలో వ్యాప్తి చెందే విష జ్వరాల పట్ల వైద్య ఆరోగ్యశాఖ పూర్తి అప్రమత్తంగా ఉంది. ఇప్పటికే దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నిల్వ ఉన్న నీటిని తొలగించాలి.

– అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

జిల్లావ్యాప్తంగా ఫీవర్ సర్వే..

డెంగీ, మలేరియా కేసులు నమోదైన ఏరియాల్లోని 480 ఇళ్లను సర్వేచేసి ఆయా కుటుంబాల్లోని వారి రక్తనమూనాలు సేకరించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 12,110 ఇళ్లల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి 1,565 మెడికల్ కిట్లను పంపిణీ చేసింది.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో జానా, ఉత్తమ్, కోమటిరెడ్డి



జానారెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 26 మందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా రేవంత్‌రెడ్డితోపాటు మరో 25 మంది సభ్యులను నియమించారు. అందులో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డికి స్థానం కల్పించారు.కాగా, రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో టికెట్ ఎవరికి కేటాయించాలన్న విషయంలో ఈ ముగ్గురి మాటకే ప్రాధాన్యం ఉండనుంది. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కతోపాటు ఈ ముగ్గురు నేతలు జిల్లాలో ఎన్నికల విషయంలో నిర్ణయాలు తీసుకోనున్నారు.

బ్లాక్‌లో 17 మిల్లులు

- ఫోర్టిఫైడ్ బియ్యం.. ప్రమాణాల మేరకు లేవని తేల్చిన ఎఫ్‌సీఐ
- ఆ బియ్యాన్ని తిరిగి తీసుకుపోవాలంటూ మిల్లర్లకు నోటీసులు
- బియ్యం వెనక్కి తీసుకెళ్తేనే మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరణ
- ఇప్పుడు వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదంటున్న మిల్లర్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో 17 మిల్లులను ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బ్లాక్ లిస్టులో పెట్టింది. ఫిబ్రవరి నెలలో మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇచ్చిన ఫోర్టిఫైడ్ (బలవర్ధకమైన) బియ్యం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని, ఆ బియ్యాన్ని మిల్లర్లు తిరిగి తీసుకుపోవాలంటూ ఎఫ్‌సీఐ నోటీసులు జారీచేసింది. ఆ బియ్యాన్ని వెనక్కి తీసుకుపోయే వరకు మిల్లులు బ్లాక్ లిస్టులోనే ఉంటాయని, వాటి నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) తీసుకునేది లేదని స్పష్టం చేసింది. అయితే, ఆరు నెలల కిందట ఇచ్చిన బియ్యాన్ని ఎఫ్‌సీఐ అధికారులు తనిఖీ చేసుకొని ఓకే చెప్పి, ఇప్పుడు బియ్యం ప్రమాణాల ప్రకారం లేవని తిరస్కరించడం ఏమిటని, ఇప్పుడు వెనక్కి తీసుకోవడం ఎలా సాధ్యమని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు..

పేదలకు పంపిణీ చేసే బియ్యంలో అన్ని పోషకాలు ఉండటం లేదని, బలవర్ధకమైన బియ్యం ఇవ్వడం వల్ల పేదలు ఆరోగ్యంగా ఉంటారన్న ఉద్దేశంతో మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో బలవర్ధకమైన పదార్థం కలిపి (ఫోర్టిఫైడ్ కెర్నల్స్) ఇవ్వాలని సూచించింది. 99 కిలోలకు ఒక కిలో చొప్పున కెర్నల్స్ కలిపి ఇవ్వాలని చెప్పడంతో మిల్లర్లు గత ఫిబ్రవరి నెలలో ఎఫ్‌సీఐ అధికారులు ఇచ్చిన ఆ పదార్థం కలిపి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేశారు. అందులో నల్లగొండకు చెందిన సుమాంజలి, బాలజీ రైస్ ఇండస్ట్రీస్, దేవరకొండ నియోజకవర్గంలోని శ్రీవేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్, శ్రీ సాయి లక్ష్మి రైస్ ఇండస్ట్రీస్, చిట్యాల మండలంలోని వరలక్ష్మి, శ్రీవేంకటేశ్వర, పరమేశ్వరీ ఆగ్రో ఇండస్ట్రీస్, ఎస్‌ఎల్‌వీఆర్‌ఐ, సిద్ధార్థ ఇండస్ట్రీస్ ఇచ్చిన 1566 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ తనిఖీ బృందం తిరస్కరించింది. అలాగే యాదాద్రి జిల్లాలో 8 మిల్లులకు చెందిన 1390 మెట్రిక్ టన్నులకు పైగా ఇచ్చిన బియ్యాన్ని తిరస్కరించింది.

ఇప్పుడు వెనక్కి తీసుకెళ్లమంటే ఎలా?

ఫిబ్రవరి నెలలో ఇచ్చిన బియ్యాన్ని అన్ని రకాలుగా తనిఖీ చేశాకే తీసుకున్నారు. ఇప్పుడు అవి నిబంధనల మేరకు లేవని తిరస్కరించడం సరైంది కాదు. ఎఫ్‌సీఐ ఇచ్చిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను వారు చెప్పిన విధంగానే కలిపాం. దాంట్లో మా ప్రమేయం ఉండదు. అలాంటప్పుడు వెనక్కి ఎలా తీసుకుంటాం. అధికారులు ఆలోచించాలి. ఇప్పటికే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రిని కలిసి సమస్య పరిష్కరించాలని కోరాం.

– యాదగిరి, మిల్లర్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

కెర్నల్స్ మిక్సింగ్‌లో తేడా..

99 కిలోల బియ్యానికి ఒక కేజీ చొప్పున ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలుపాలి. 900 గ్రాముల నుంచి కిలో 100 గ్రాముల వరకు కలిపితే నాణ్యతా ప్రమాణాలు సరిగ్గా ఉంటాయని, ఆ విధంగా కలుపాలని ఎఫ్‌సీఐ సూచించింది. అయితే, ఫోర్టిఫైడ్ బియ్యం విషయంలో ఢిల్లీ నుంచి వచ్చిన టీమ్.. ఎఫ్‌సీఐకి మిల్లర్లు ఇచ్చిన బియ్యంలో శాంపిల్స్ తీసుకొని ఢిల్లీకి పంపింది. అందులో నిబంధనల ప్రకారం ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలుపలేదని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని ఆరు మిల్లులు ఇచ్చిన బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నెల్స్ (ఎఫ్‌ఆర్‌కే) తిరస్కరణ పరిమితి కంటే తక్కువగా (బిలో రిజెక్షన్ లిమిట్ – బీఆర్‌కే) ఉన్నాయని పేర్కొంది. మరో మూడు మిల్లుల బియ్యంలో మైక్రో న్యూట్రియాంట్స్, ఫోర్టిక్యాంట్స్ లోటు ఉందని స్పష్టం చేసింది. యాదాద్రి జిల్లా నుంచి ఇచ్చిన 8 మిల్లుల బియ్యంలోనూ ఇదే పరిస్థితి నెలకొందని భారత ఆహార సంస్థ పరిశోధన, అభివృద్ధి విభాగం చేసిన తనిఖీలో వెల్లడైందని వివరించింది. ఈ మేరకు 28 రోజుల కిందటే నోటీసులు ఇచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, వాటి నుంచి సీఎంఆర్ కూడా తీసుకోవద్దని బ్లాక్ లిస్ట్‌లో పెట్టినట్లు తేలడంతో మిల్లర్లు గందరగోళంలో పడ్డారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత జిల్లా అధికారులు, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వర్షపాతం వివరాలు, జలాశయాల్లో నీటి మట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూసీ ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీటి ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, తండాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. రోడ్లపై వర్షపు నీరు అధికంగా ప్రవహిస్తే ట్రాఫిక్‌ను ఇతర ప్రాంతాల గుండా మళ్లించాలన్నారు. ఇరిగేషన్ అధికారులు అన్ని చెరువులను సందర్శించి, ఎంతవరకు నిండాయో వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎక్కడైనా చెరువులు, వాగులు తెగిపోయే దశలో ఉంటే ఇసుక బస్తాలను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, లోతట్టు ప్రాంతాలు, చెరువుల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. వరదల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా చూడాలన్నారు. వర్షానికి వ్యవసాయ పంటలు దెబ్బతింటే అధికారులు రిపోర్ట్ చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించినందున విద్యార్థులు బయటికి రావొద్దని కోరారు. వర్ష సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమర్పించేందుకు వివరాలను నివేదించాలని అధికారులను ఆదేశించారు.



కట్టంగూర్: బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఓటు హక్కుపై బీఎల్‌ఓలకు శిక్షణ

కట్టంగూర్: 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలు సేకరించాలని సూచించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ పోరెళ్ల సునీత ఉన్నారు.

నీటిపారుదల శాఖ ఇంజనీర్ల బదిలీ

నల్లగొండ: నీటిపారుదల శాఖలో ఎస్‌ఈలు, ఈఈలు, డీఈలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు కొత్తగూడెంలో ఎస్‌ఈగా పనిచేస్తున్న పర్వతేశ్వర్‌రావును నల్లగొండ సీఈ ఆఫీస్‌కు బదిలీ చేశారు. నల్లగొండ సీఈ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఈఈ ప్రభుకళ్యాణ్‌ను డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. మిర్యాలగూడ డివిజన్ – 4లో పనిచేస్తున్న డీఈ సంపత్‌ను నల్లగొండలోని గంధవారిగూడెంలో ఉన్న సబ్ డివిజన్ – 1కు బదిలీచేశారు. అక్కడే డీఈగా పనిచేస్తున్న మనోహర్‌రెడ్డిని ఎల్లారెడ్డికి బదిలీ చేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డిలో డివిజన్ -4లో పనిచేస్తున్న డీఈ గోపీనాథ్‌ను మిర్యాలగూడకు బదిలీ చేశారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు పరిష్కరించాలని ఎస్పీ అపూర్వరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్పీ కార్యాలయం నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫంక్షనల్ వర్టికల్స్‌ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటి సంఖ్య తగ్గించే దిశగా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. నేరస్తులకు శిక్ష పడేవిధంగా తగిన సాంకేతిక ఆధారాలను కోర్టుకు అందించాలని తెలిపారు. మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. డయల్ 100, సైబర్ నేరాలపై తక్షణమే స్పందించాలని, పెట్రోలింగ్ గస్తీ ముమ్మరం చేయాలన్నారు. నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేష్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు కుటుంబాలకు శాఖ పరంగా అండగా ఉంటామని ఎస్పీ అపూర్వరావు అన్నారు. ఎస్పీ కార్యాలయం షీ టీంలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న యాదగిరి ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భార్య అరుణకు రూ.2లక్షల చేయూత చెక్కును గురువారం ఎస్పీ అందజేశారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్ని సౌకర్యాలను అందేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, కార్యదర్శి సోమయ్య యాదవ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్పీ

వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

నల్లగొండ టూటౌన్: వేతన స్కేల్ గడువు జూన్ 30తో ముగిసినందున వెంటనే వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదీన పెన్షన్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ధర్నాకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బంగారయ్య, నూకల జగదీష్ చంద్ర, పందిరి శ్యాంసుందర్, గోవర్ధన్, అబ్దుల్‌ఖాదర్, విద్యాసాగర్‌రెడ్డి, సోమయ్య, భిక్షమయ్య, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్యపూజలు సంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీదళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయంలోని ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు కొనసాగాయి. ఆలయ ముఖమండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన జరిపించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


లింగస్వామి (ఫైల్)

రామన్నపేట: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన గురువారం రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నీర్నెముల గ్రామానికి చెందిన సుర్వి లింగస్వామి(47) కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని ఓ రైతు పొలం వద్ద కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టు పైనుంచి బురద పొలంలో పడ్డాడు. దీంతో అతడి తల, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి బురదలో నుంచి లేపి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి..

డిండి: విద్యుత్ స్తంభం ఎక్కుతుండగా కాలు జారి కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన డిండి మండల పరిధిలోని గోనకొల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనకొల్ గ్రామానికి చెందిన విభూది వెంకట్రాం(54) అదే గ్రామపంచాయతీలో కార్మికుడి(మల్టీవర్కర్)గా పని చేస్తున్నాడు. కాగా గురువారం గ్రామంలోని ఓ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో దానిని సరిచేసేందుకు విద్యుత్ స్తంభాన్ని ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

● దంచి కొట్టిన వర్షం


భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామ పరిధిలో వర్షంలోనే అన్నం తింటున్న మహిళా కూలీలు


యాదాద్రి కొండపై వర్షంలో తడుస్తూ పరుగులు పెడుతున్న భక్తులు


హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం


యాదాద్రి కొండ కింద గండి చెరువులోకి చేరుతున్న వర్షం నీరు


యాదాద్రి కొండపై ఆలయ వీధుల్లో నుంచి ప్రసాద కౌంటర్ల వరకు పారుతున్న నీళ్లు


ఆలేరు మండల శివారులో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన పత్తి చేనులో నిలిచిన వర్షం నీరు

ఒకే రోజు మృతిచెందిన వృద్ధ దంపతులు

యాదగిరిగుట్ట రూరల్: వృద్ధ దంపతులు ఒకే రోజు మృతిచెందిన ఘటన యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన మాటూరి లక్ష్మమ్మ (70), మాటూరి శంకరయ్య (78) భార్యాభర్తలు. వీరిద్దరు గ్రామంలోనే నివసిస్తూ ఉన్నారు. కాగా లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం వేకువ జామున మృతిచెందగా, అదే రోజు రాత్రి సమయంలో శంకరయ్య కూడా అనారోగ్యంతోనే చనిపోయాడు. లక్ష్మమ్మ అంత్యక్రియలు మంగళవారం, శంకరయ్య అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో వృద్ధ దంపతులు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్


గుండ్రాంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు


డీసీఎంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటికి తీస్తున్న స్థానికులు

- గుండ్రాంపల్లి శివారులో కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం
- డీసీఎం డ్రైవర్‌కు గాయాలు

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరగడంతో రెండు, మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వివరాలు.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని బతుకమ్మకుంట సమీపంలో జాతీయ రహదారిపై బ్రేక్ డౌన్ అయ్యి నిలిచిపోయిన కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ముజాఫర్‌ఖాన్ డీసీఎంలో ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడిని బయటికి తీసి అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై సుమారు రెండు, మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నార్కట్‌పల్లి సీఐ మహేష్‌తో పాటు పోలీసు సిబ్బంది, జీఎంఆర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా నృసింహుని నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తి కట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగళ్యధారణ చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, బ్రహ్మచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అనుమానాస్పద స్థితిలో 20 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

అడ్డగూడూరు: అనుమానాస్పద స్థితిలో 18 గొర్రెలు, 2 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన నోముల యాదగిరి, నోముల నవీన్ గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగా గురువారం తెల్లవారుజామున 5గంటల సమయంలో తమ గొర్రెలను ఇంటి వద్ద ఉన్న దొడ్డిలో నుంచి గ్రామ శివారులోని దొడ్డిలోకి తోలి తిరిగి ఇంటికి వచ్చారు. అనంతరం ఉదయం 10గంటల సమయంలో గొర్రెలను మేపడానికి గ్రామ శివారులోని దొడ్డి వద్దకు వెళ్లగా.. 18 గొర్రెలు, 2 గొర్రెపిల్లలు మృతిచెంది ఉన్నాయి. ఈ విషయాన్ని స్థానిక పశువైద్యాధికారులకు తెలపగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. మృతిచెందిన గొర్రెలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


చెరువు కట్ట దిగువన బోల్తాపడిన ట్రాక్టర్

మాడుగులపల్లి: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుగుల గ్రామానికి చెందిన మిర్యాల దయాకర్‌రెడ్డి (55) తనకున్న ఎనిమిదెకరాల్లో వ్యవసాయం చేస్తూ ట్రాక్టర్‌ను కిరాయికి సైతం నడుపుతుంటాడు. గురువారం ఉదయం ఓ రైతుకు చెందిన పొలం దున్నేందుకు ట్రాక్టర్‌కు కల్టివేటర్ బిగించుకొని చెరువుకట్ట పైనుంచి వెళ్తుండగా అదుపుతప్పి కట్ట దిగువన బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న దయాకర్‌రెడ్డికి గేర్ రాడ్డు కడుపులోకి బలంగా గుచ్చుకుపోయి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాడుగులపల్లి పోలీసులు పేర్కొన్నారు.



అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

- ప్రయాణికులు క్షేమం


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

కోదాడరూరల్: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టి పెంటకుప్పలోకి దూసుకెళ్లిన ఘటన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌లోని మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 30 మంది ప్రయాణికులతో విజయవాడ వెళ్తుంది. మార్గమధ్యలో కోదాడ పట్టణంలోకి రాగానే బైపాస్ దిగిన తర్వాత కొమరబండ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి పెంటకుప్పలోకి దూసుకెళ్లి ఆగింది. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బ్రహ్మ మురారీ

నూతనకల్: వివిధ దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తుంగతుర్తి సీఐ బ్రహ్మ మురారీ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం వెంకెపల్లి గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంతో పాటు తుంగతుర్తి మండల పరిధిలోని వివిధ దేవాలయాల్లో ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. కాగా గురువారం నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండల పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన కొమ్మరగిరి యాకోబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. వెంకెపల్లి దేవాలయంతో పాటు తుంగతుర్తి మండలంలోని గుడితండా, దొనబండా తండాల్లోని దేవాలయాల్లో తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు గతంలో సొంతమాగులూరు, నాంపల్లి, మేడికొండూర్ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడడంతో పాటు తాళాలు వేసిన గుళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేస్తున్నాడని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ వల్లపు నారాయణ, సిబ్బంది దాచేపల్లి అరవింద్, తిరపతయ్య, అమృతయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బాల నేరస్తుల అరెస్ట్

- 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం


బాల నేరస్తుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలతో సీఐ రాఘవేందర్, ఎస్‌ఐ శివతేజ్

మిర్యాలగూడ అర్బన్: చదువు మధ్యలోనే ఆపేసి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు బాల నేరస్తులను మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు చెందిన ఇద్దరు, శాంతినగర్‌కు చెందిన ఒకరు మొత్తం ముగ్గురు బాలురు తమ చదువు మధ్యలోనే ఆపేశారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన ఆ ముగ్గురు బాలురు దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో గత మూడు నెలలుగా మిర్యాలగూడ పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలలో పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసేవారు. ఈ విధంగా మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, మిర్యాలగూడ రూరల్ పరిధిలో 2, వాడపల్లి పరిధిలో 1, దేవరకొండ పరిధిలో 1, దాచేపల్లి పరిధిలో 1 కేసు వీరిపై నమోదయ్యాయి. గురువారం మిర్యాలగూడ పట్టణంలో వన్ టౌన్ కానిస్టేబుళ్లు నాగరాజు, వెంకటేశ్వర్లు వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఈ ముగ్గురు బాలురు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన దొంగతనాలను అంగీకరించారు. ఈ ముగ్గురూ కలిసి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన 5 ఐరన్ గేర్ బాక్స్‌లను చోరీ చేశారని, వీరిలో ఒకరిపై గతంలోనే 11 కేసులు నమోదయ్యాయని పోలీసులు గుర్తించారు. వీరి వద్ద నుంచి 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ ముగ్గురు బాల నేరస్తులను హైదరాబాద్‌లోని సైదాబాద్ ఏరియాలో గల జువైనల్ హోంకు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా నేరస్తులను పట్టుకున్న కానిస్టేబుళ్లతో పాటు సీఐ రాఘవేందర్, ఎస్‌ఐ శివతేజ్‌లను జిల్లా ఎస్పీ అపూర్వ రావు అభినందించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

ఆలేరురూరల్: మండలంలోని కొల్లూరు గ్రామ శివారులో గురువారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందాయి. వివరాలు.. కొల్లూరు గ్రామానికి చెందిన గాజుల అంజయ్య తన రెండు పాడి గేదెలను వ్యవసాయ బావికి తీసుకెళ్తున్నాడు. మధ్యలో గేదెలు వాగు దాటే క్రమంలో ఇనుప విద్యుత్ స్తంభానికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి.

తిరుమల ట్రేడింగ్ కంపెనీలో తనిఖీలు

బీబీనగర్: మండలంలోని రాఘవాపురంలో తిరుమల ట్రేడింగ్ పరిశ్రమలో గురువారం పొల్యూషన్ బోర్డు అధికారులు తనిఖీలు చేశారు. తమ గ్రామం నుంచి పరిశ్రమను దూరంగా తరలించాలని గ్రామస్తులు వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కంపెనీ నుంచి వస్తున్న కాలుష్యంతో అనారోగ్యం బారిన పడుతున్నామని, ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు మొక్కుబడిగా పొల్యూషన్ బోర్డు సిబ్బందిని పంపి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్ష చేస్తున్నవారితో పోలీసులు చర్చలు జరిపారు. శాంతియుతంగా దీక్ష కొనసాగించాలని సూచించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందిన ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని చిన్న సూరారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. నకిరేకల్ పట్టణంలోని కాటమయ్య బజార్‌కు చెందిన తాటి లక్ష్మీనారాయణ(51) గురువారం రిజిస్ట్రేషన్ పని నిమిత్తం నల్లగొండకు బైక్‌పై వచ్చాడు. పని పూర్తి చేసుకుని తిరిగి రాత్రి నకిరేకల్‌కు వెళ్తుండగా చిన్న సూరారం వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రారంభమైన మొహర్రం నెల

- పీర్లకొట్టాల్లో కొలువుదీరిన సవార్లు
- కులమతాలకతీతంగా గ్రామాల్లో సందడే సందడి

అసై దులా..!


భువనగిరి పట్టణంలో కొలువుదీరిన పీర్లు

భువనగిరిటౌన్: అసై దులా.. అసైదులా అంటూ ఆలావా చుట్టూ ఆటలు.. కాళ్లకు గజ్జెలు కట్టుకొని పీర్లు ఎత్తుకొని ఎగరడం.. కమ్మనైన షర్బత్(బెల్లం పానకం) తాగి ఊదుపొగ వాసనతో భక్తిపారవశ్యంలో మునిగి పోవడం.. ఇదంతా మొహర్రం మాసంలో మొదటి పది రోజుల పాటు పల్లెలు, పట్టణాల్లో కన్పించే వాతావరణం. హిజ్రీ శకం ఆధారంగా మొదలైన ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి మాసం మొహర్రం. దీనిని షహీద్(అమరుల) నెల అని కూడా అంటారు. గురువారం నుంచి ఈనెల ప్రారంభమైంది. ఇప్పటికే పీర్ల కొట్లాల్లో సవార్లు కొలువుదీరాయి.

ఇమామ్ హుస్సేన్ అమరత్వాన్ని స్మరించుకుంటూ..

కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం మనవడు ఇమామ్ హుస్సేన్ మొహర్రం మాసంలో 10వ తేదీన అమరుడయ్యారు. దీంతో ఆ రోజును యౌమె ఆషూరా అని పిలుస్తారు. దీనిని స్మరించుకుంటూ ఈనెలలో మొదటి పది రోజుల పాత శోక తప్త దినాలుగా పాటిస్తారు. షియా ముస్లింలు మాతం నిర్వహిస్తారు. వీరు 68 రోజుల పాటు శోక దినాలుగా పాటిస్తారు.

హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా..

నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రంను ముస్లింలే కాక అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవడం ఏళ్లతరబడి ఆనవాయితీగా వస్తోంది. ప్రజలు పీర్లకు దట్టీలు, కుడుకలు, బెల్లం, డబ్బులు కట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. మతసామర్యానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుంది.

భువనగిరి పట్టణంలో ప్రత్యేకంగా..

భువనగిరి పట్టణంలోని ఖాజీమహల్లాలో మొహర్రం కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. చిన్నా, పెద్ద అనే తార తమ్యం లేకుండా దారిపొడవునా ఎదపై కత్తులతో బాదుకుంటూ రక్తాన్ని చిందిస్తూ మాతం ప్రదర్శన నిర్వహిస్తారు. పదో రోజున పీర్లను ఊరేగిస్తారు. అంతకుముందు రాత్రి అగ్ని గుండంలో దూకడం, అగ్గిలో నడవటం వంటివి చేస్తారు. హజరత్ ఇమాం హుసేన్‌ను స్మరించుకుంటూ పంజా(పీర్ల ప్రతిమ)లను ఊరేగించి తమ సంతాపం ప్రకటిస్తారు.